క్లుప్తంగా

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ-2 సీహెచ్ సుబ్బారావు తెలిపారు. హెడ్‌కుక్-1, నైట్ వాచ్ ఉమెన్-1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 15వ తేదీ లోపు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. 18–42 ఏళ్ల మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

కురిచేడు: మండలంలోని ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో తులతూగాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ పుష్కలంగా అందలాని దుర్గా భవాని మాతను కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నానీ

దొనకొండ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని గౌతమి కళాశాల అడ్మిన్ నానీ తెలిపారు. దసరా పండగ సందర్భంగా గౌతమి కళాశాల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం 8 టీమ్‌లు పాల్గొన్నాయి. దొనకొండ అలవెన్స్ టీమ్ ట్రోఫీని గెల్చుకుంది. ఫైనల్ మ్యాచ్ ఇండ్లచెరువు 2, దొనకొండ 2 పోటీ పడగా దొనకొండ విన్నర్‌గా ఇండ్లచెరువు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు అడ్మిన్ నానీ ట్రోఫీ మెడల్స్ అందజేశారు. విన్నర్‌గా గెలిచిన దొనకొండ-2 గౌతమి కళాశాల కరస్పాండెంట్ కనుమర్ల గుండారెడ్డికి, అధ్యాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

జీవం పోసుకున్న పంటలు



పత్తి పంటలో నిల్వ ఉన్న వర్షం నీరు

పెద్దారవీడు: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి సాగు చేసిన పంటలు జీవం పోసుకున్నాయి. మండల పరిధిలో పత్తి, మిరప, కంది, పొగాకు, టమోటా, కూరగాయలు తదితర పంటలు పది రోజుల క్రితం పగలు ఎండలు తీవ్రంగా ఉండటంతో ఎండుముఖం పట్టాయి. సకాలంలో కురుస్తున్న వర్షానికి పంటలు జీవం పోసుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల వరకు పంటలకు నీటి తడులు కట్టకపోయినా పంటలు బాగానే ఉంటాయని రైతులు చెబుతున్నారు. మిరప, పొగాకు నాటిన మొక్కలు చనిపోయిన వాటి స్థానంలో నూతన మొక్కలు నాటడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో కొంత మంది రైతులు వర్షం నీటిని పొలం నుంచి బయటకు పంపేందుకు చర్యలు తీసుకున్నారు. కురుస్తున్న వర్షానికి గ్రామాల్లో ప్రధాన వీధుల్లో నీరు నిల్వ ఉండిపోయాయి.



మిరప పంటలో వర్షపు నీరు

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

మార్కాపురం రూరల్: విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మార్కాపురం మండలం పెద్దయాచవరంలో శుక్రవారం జరిగింది. రైతు దారా అల్లూరయ్యకు చెందిన గేదె సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరు తగిలి మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.50 వేల నుంచి 70 వేల వరకూ ఉంటుందని రైతు తెలిపాడు.

బెల్ట్‌లకు భారీగా మద్యం సరఫరా

- రెస్టారెంట్‌ల్లోనూ మద్యం అమ్మకాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

దర్శి: మద్యం అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతోంది. ప్రభుత్వ దుకాణాల నుంచి యథేచ్ఛగా మద్యం తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు నటిస్తున్నారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీ పరిధిలో 5 మద్యం దుకాణాలు ఉండగా రూరల్ ప్రాంతంలో ఒక దుకాణం ఉంది. తాళ్లూరు మండలంలో-4, కురిచేడు-3, దొనకొండ-3, ముండ్లమూరు మండలంలో-3 కలిపి మొత్త 19 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం దర్శి మున్సిపాలిటీలో-5, దర్శి రూరల్-4, ముండ్లమూరు-4, తాళ్లూరు-4, కురిచేడు-3, దొనకొండ-3 షాపులకు టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం లైసెన్స్‌లు ఇస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. గత ప్రభుత్వంలో కలంటే 4 షాపులు నియోజకవర్గంలో అదనంగా ఏర్పాటు చేస్తున్నారన్న మాట. ఈ మద్యం దుకాణాల్లో ఒక్కో షాపునకు నలుగురు లెక్కన 56 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులను తీసి వేయించి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు 90 శాతానికిపైగా ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న వారిని తీసివేయించి తమకు అనుకూలురైన వారిని నియమించుకుని పాలకులు మద్యం దందాకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు అందరూ కలిసి మద్యం విచ్చలవిడిగా గ్రామాలకు, బెల్ట్ షాపులకు తరలిస్తుండటం గమనార్హం.

తిలా పాలం తలా పిడుకెడు

ఈ తతంగం నడిపించేందుకు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ఐదుగురు నాయకులకు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసుకునే అనధికార లైసెన్స్‌లు ఇచ్చారు. వారు తిలాపాపం తలా పిడికెడు అన్న సామెతగా బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసి క్వార్టర్ బాటిల్‌కు రూ.20 లెక్కన లెక్క కట్టి మరీ తమ నాయకురాలికి అప్పజెప్పున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి తమకేమీ తెలియనట్లు గుడ్లప్పగించి చూస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నాలుగు నెలలుగా గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందడం లేదుగానీ మద్యం మాత్రం ఏరులై పారుతోంది. ఏ గ్రామంలో చూసినా టీడీపీ నేతల కనుసన్నల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. దర్శి నియోజకవర్గంలో సుమారు 600 బెల్ట్ షాపుల వరకు నడుస్తుండటం గమనార్హం. పబ్లిక్‌గా బోర్డులు పెట్టి నడుపుకునే రెస్టారెంట్‌ల్లో సైతం భారీగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. బెల్ట్ షాపులకు, రెస్టారెంట్‌లకు ప్రభుత్వ షాపుల నుంచి మద్యం సరఫరా జరుగుతోంది. ఒక్కసారిగా కేసు మద్యంగానీ, బీర్లుగానీ కావాలంటే క్వార్టర్ బాటిల్‌కు రూ.30, బీర్ బాటిల్‌కు రూ.50 అదనంగా చెల్లిస్తే ఎన్ని కేసులైనా మద్యం సరఫరా చేస్తున్నారు. ఇందులో రూ.20 తమ నియోజకవర్గ నేతకు, రూ.10 షాపులో పని చేస్తున్న వారికి, ఇతర పోలీస్, ఎక్సైజ్ మామూళ్లకు, మద్యం సరఫరా చేసే వారికి కమీషన్‌గా అందజేస్తున్నట్లు సమాచారం.



ముండ్లమూరు నుంచి అద్దంకి వెళ్లే రోడ్డులో ఓ రెస్టారెంట్‌లో ఇలా..



ఓ వైన్‌షాపు వెనుక మద్యం తాగి డస్ట్‌బిన్‌లో పడేసిన ఖాళీ బాటిళ్లు

ఘనంగా దేవీనవరాత్రి ఉత్సవాలు



కురిచేడు: వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



కురిచేడు: మహిషాసురమర్దినిగా జ్ఞానప్రసూనాంబదేవి



పుల్లలచెరువు: మహిషాసురమర్దిని దేవిగా..



దొనకొండ: మహిషాసురమర్దినిగా ఈశ్వరీదేవి



దర్శి: మహిషాసురమర్దినిగా కనకదుర్గమ్మ తల్లి



దర్శి: మహిషాసురమర్దినిగా దద్దాలమ్మ అమ్మవారు

దర్శి: నియోజకవర్గంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూల మాలలతో అమ్మవారి అలంకరణ అందరినీ ఆకర్షించింది. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. పట్టణంలోని దద్దాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ తల్లి మహిషాసురమర్దినిదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. తాళ్లూరు మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గుంటి గంగా భవాని అమ్మవారు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని అందంగా పూల మాలలతో అలంకరించారు. ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామంలో శ్రీ భ్రమరాంబికాదేవి మాతా సమేత చెన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ భ్రమరాంబికాదేవి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దినిదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారు జామున ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు చేశారు. ఆయా ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా 9వ రోజు ఆశ్వీజ శుద్ధ నవమి భాగంగా ఆలయంలో ఈశ్వరీదేవి శ్రీమహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి పూజారి మణిశర్మ ఆలయంలో అమృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, ఆయుధ పూజలు, భజనలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించి సామూహిక హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. దొనకొండ వాస్తవ్యులు గంగేంద్రం దానం, కవిత దంపతులు అల్పాహారం అందజేశారు. విజయదశమి సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారని భైరవానంద స్వామి తెలిపారు.

పెద్దదోర్నాల: దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. శరన్నవరాత్రులను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారు ఆయా దేవాలయాల్లో వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రుల్లో చివరి రోజైన మహర్నవమి నాడు పూర్ణాహుతి కార్యక్రమం వేదమంత్రోచ్ఛరణల నడుమ వేద పండితులు వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు వేకువ జాము నుంచే క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, దశ చండీ పారాయణం నిర్వహించారు. వాసవీ అమ్మవారి మూలవిరాట్‌ను పసిడి, రజిత ఆభరణాలు, మంత్రపరిమళ పుష్పాలతో శోభనామాయంగా అలంకరించారు. చివరి రోజైన మహర్నవమి నాడు అమ్మవారికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమం వేదపండితుల వేదమంత్రోచ్ఛరణ ల నడుమ ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనాయ పారాయణం చండీ హోమం నిర్వహించారు. మహర్నమి రోజున శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శ్రీ మహా చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దర్శి: మహిషాసురమర్దినిగా పోలేరమ్మ అమ్మవారు

పుల్లలచెరువు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మహర్నవమిని ఘనంగా నిర్వహించారు. ముటుకుల యల్లమ్మ దేవర ఆలయంలో, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ మహిసాసురమర్దిని దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవార్లను భక్తులు దర్శనం చేసుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పెద్దారవీడు: అమ్మవారి వద్ద కుంకుమార్చన చేస్తున్న భక్తులు

పెద్దారవీడు: దసరా నవరాతురల ఉత్సవాల్లో భాగంగా చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో శ్రీ గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు వేదవతి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి గణపతి పూజ, కుంకుమార్చన, సహస్రనామావళి, పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారికి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీరించారు. ఉభయదాతలు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ శక్తి క్షేత్రం త్రిపురాంతకంలో బాలాత్రిపురసుందరీదేవి శుక్రవారం మహర్నవమి సందర్భంగా సిద్ధిదాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అశ్వవాహన సేవ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. శనివారం విజయదశమి రోజు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో గ్రామోత్సవం జరుగుతుంది.

కురిచేడు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా 9వ రోజు శుక్రవారం శ్రీజ్ఞానప్రసూనాంబదేవి, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిలు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు కుంకుమార్చన, సహస్రనామార్చన చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో అక్రమ పద్ధతిలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సుమారు 20 మందిని ఎటువంటి నోటీసులు లేకుండా తొలగించడాన్ని వ్యతిరేకించారు. కాంట్రాక్టు కార్మికులు చేసిన తప్పును కనబరుస్తూ మెమో ఇవ్వాలని, అలాంటివేమీ లేకుండా మున్సిపల్ అధికారులు వ్యక్తులకు తలొగ్గి ఇటువంటి చర్యలు తీసుకోవడం విచారకరమన్నారు. కార్మిక సంఘ నాయకులు సుబ్బరాయుడు, హరి, రమణ, చెన్నయ్య, శేషిరెడ్డి, సలామ్‌ఖాన్, యూసఫ్, ఇమాంసా పాల్గొన్నారు.

ఉల్లిపాయలు, టమోటా విక్రయ కేంద్రం ప్రారంభం

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక పెద్దమార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఉల్లిపాయలు, టమోటా విక్రయ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో ధరలు భారీగా పెరిగిన టమోటాను ఈ కేంద్రంలో కిలో రూ.50కి, ఉల్లిపాయలను రూ.35కు, నూనె ప్యాకెట్‌ను రూ.124కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

కంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు టి.తిరుపతిరావు అన్నారు. శుక్రవారం కంభంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలు తగ్గించడంలో, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బి.పాండురంగారావు, అన్వర్, పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు తిప్పలు

రాచర్ల: గ్యాస్ వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. ఈకేవైసీ, నూతన గ్యాస్ పుస్తకాలు, వేలిముద్రలు, ఆధార్ లింక్, ఫోన్ నంబర్ లింక్ కోసం రాచర్ల గ్యాస్ కార్యాలయం వద్ద వృద్ధులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన మూడు రోజులుగా గ్యాస్ కార్యాలయం ఎదుట భారత్ గ్యాస్ ఏజెన్సీ సంబంధించిన యజమానులు ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే నిలబడి తమ పనులు చేయించుకుంటున్నారు. కనీసం తాగేందుకు కూడా నీరు ఏర్పాటు చేయలేదని వృద్ధులు వాపోతున్నారు.

చిల్లచెట్లు తొలగింపు

గిద్దలూరు రూరల్: ప్రజాసంకల్ప వేదిక అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి తన సొంత నిధులు వెచ్చించి మండలంలోని కొంగలవీడు రోడ్డులో చిల్లచెట్లను శుక్రవారం తొలగించారు. గ్రామంలోని కొందరు రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఉన్నాయని రంగసాయిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన స్పందించి చిల్లచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. గ్రామస్తులు ఆయనను అభినందించారు.

సీపీఎం కంభం మండల కార్యదర్శిగా అన్వర్

కంభం: సీపీఎం కంభం మండల నూతన కార్యదర్శిగా షేక్ అన్వర్ ఎన్నికయ్యారు. సీపీఎం జిల్లా నాయకుడు తిరుపతిరావు, దానం, తదితరులు అన్వర్‌ను అభినందించారు.

యూట్యూబ్ చానళ్ల జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు

దర్శి: యూట్యూబ్ చానళ్ల నిర్వాహకుల జిల్లా కమిటీని దర్శి పట్టణంలోని రాఘవ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూము వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కోటంశెట్టి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడిగా కేవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఏ.రంగస్వామిరెడ్డి, కోశాధికారిగా సోము చొడారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా చొప్పరపు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా కోలా సంతోష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి. ప్రసన్నకుమార్, ఉప కోశాధికారిగా టి.శ్యాంకుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వేమా శివకుమార్, జి.సురేష్, జే.వెంకట్రావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులుగా జూపల్లి కోటేశ్వరరావు, పుప్పాల పాపారావు పాల్గొన్నారు.